
# గది



**కాం**తారావు నిజమైన బ్రహ్మచారి. చాలామంది బ్రహ్మచారుల్లా పైకి కబుర్లు చెబుతూ, చెడుతిరుగుళ్ళు తిరిగే అలవాటు అతనికి లేదు. అతను కొత్తగా ఆ ఊరు వచ్చాడు. అతను ఆ ఉద్యోగంలో ప్రవేశించి నిండా రెండు నెలలు కాలేదు. కొత్త ఊరు. కొత్త ఉద్యోగం ఎట్లా ఉంటుందో అని భయపడుతూనే ఆ ఊరు వచ్చాడు. కాని, అతనలా భయపడకుండానే అతను ఉద్యోగంలో చేరిన పది రోజులకే అతని కొలీగ్ రామ్మూర్తి అతనికి మంచి మిత్రుడై కాంతారావు హోటల్లో వుండలేకపోతున్నాడని గ్రహించి రెండు రోజులు లీవు మీద అతి కష్టంతో ఆఫీసుకు కొంచెం దూరంలో వున్న ఓ పేటలో చిన్న గదిని అద్దెకు చూపించాడు. ఆ రాత్రికే తన మకాంని హోటలు నుంచి గదికి మార్చేశాడు కాంతారావు.

కాంతారావు ఆ గదిలో ప్రవేశించిన వారం రోజుల తర్వాత ఓ సంఘటన జరిగింది. ఏమిటంటే అతను తొమ్మిది గంటలకల్లా స్నానం ముగించి డ్రెస్ చేసుకుని గదికి తాళం పెట్టి బయటకు వెళ్ళబోతుండగా ఓ అమ్మాయి అతని దగ్గరకు వచ్చింది. ఇరవైయేళ్ళ లోపు వయస్సు, ఎర్రని శరీరఛ్ఛాయ, కొంచెం లావుగా, పొడుగ్గా వుంది. నుదుట చిన్న ఎర్ర తిలకం బొట్టు, విశాలంగా ఉన్న కళ్ళు, చెవులకు పెద్ద పెద్ద రింగులు వేళ్ళాడుతున్నాయి. రెండు జడలు వేసుకొని ఓ జడలో ఎర్రమందార పువ్వును తురుముకుంది. ఆ అమ్మాయి గబగబా నడిచి రావడంవల్లనేమో ఆ పువ్వు పడిపోవటానికి సిద్ధంగా ఉంది.

ఆ అమ్మాయి రాకలోని ఆంతర్యం అతనికి అంతుపట్టలేదు. 'ఎవరీ అమ్మాయి? ఎందుకొచ్చింది?' ఇలాంటి ప్రశ్నలు అతని మెదడులో తలెత్తాయి.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత ఆ అమ్మాయే అన్నది. "నాపేరు సరస్వతి. ఈ వీధిలో మూడో ఇంట్లో వుంటున్నాను. ఇంటర్ పాసైనాను. మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాను" అన్నది కొంచెం తడబాటుతో.

"నన్ను కలుసుకోవాలని వచ్చారా?" కళ్ళను కొంచెం పెద్దవి చేస్తూ అడిగాడు.

"అవును. మీరు రచయితని నిన్ననే పోస్ట్‌మేన్ ద్వారా తెలిసింది. అతను మిమ్మల్ని రోడ్డు మీద కలుసుకుని పత్రికను మీకు యివ్వటం చూశాను. అతనికి మీరు రచయితననీ, పదిరోజుల్లో ఎమ్వో రావచ్చుననీ చెప్పారుట. పోస్ట్‌మేన్‌ని అడిగితే చెప్పాడు. మీ కథ చదివాను. చాలా బాగుంది. మిమ్మల్ని కలుసుకుని మాట్లాడాలనిపించింది. వచ్చాను" అన్నది సరస్వతి సిగ్గుపడుతున్నట్టుగా ముఖం పెట్టి.

"చాలా థాంక్స్. నేనిప్పుడు హోటలుకి వెళ్ళి భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళబోతున్నాను. రేపు ఆదివారం కదా... రండి... తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అన్నాడు కాంతారావు.

సరేనన్నట్లు తల ఊపింది సరస్వతి.

ఇద్దరూ గేటు దాటి బయటకు వచ్చారు. చెరోవైపుకి వెళ్ళిపోయేరు.

అనుకున్నట్టుగానే ఆ మరుసటిరోజు ఉదయం తొమ్మిది గంటలకు సరస్వతి, కాంతారావు గదికి వచ్చింది మరింత అందంగా ముస్తాబయి.

"కూర్చోండి" అంటూ తనకు రెండడుగుల దూరంగా వున్న కుర్చీని చూపాడు. బిడియపడుతూనే కూర్చుంది.

"మీకు కథలు చదివే అలవాటు బాగా వుందా?" తనే సంభాషణను మొదలు పెట్టాడు కాంతారావు.

అవునన్నట్లు తలాడించి తను ప్రతి పత్రికనూ విడవకుండా చదువుతాననీ, కొంతమంది

రచయితల పేర్లు తనకి బాగా గుర్తున్నాయనీ, ఏ రచయిత కథలు ఎక్కువగా ఏ పత్రికలో పడతాయో కూడా చెప్పింది సరస్వతి. ఆశ్చర్యంతో నోరు తెరవకుండా వుండలేకపోయాడు కాంతారావు. 'ఈ అమ్మాయికి కథలంటే ఇంత ఇంట్రస్టు వుందా?" అనుకున్నాడు. ఇంకా తను ఏయే నవలలు చదివిందీ, తనకు ఏ నవల బాగా నచ్చిందీ చెప్పింది సరస్వతి. ఆ తర్వాత కాంతారావు కథలు రాసే విధానాన్ని గురించి అడిగింది. 'మీరు పగలు రాస్తారా? రాత్రిళ్ళు రాస్తారా? జరిగిన సంఘటనల గురించి రాస్తారా? లేక ఊహించి రాస్తారా? ట్రాజెడీలు ఇష్టమా? కామెడీలు ఇష్టమా? నా మటుకు నేను ప్రేమకథలు చదవటమంటే హాయిగా ఫీలవుతానండీ. మీరు ఎక్కువగా అలాంటి కథలే రాయండి రావుగారూ" అన్నది చివరగా.

కాంతారావు నవ్వి ఊరుకున్నాడు.

మరో పావుగంట కూర్చుని పదిన్నరకల్లా ఇంటికి వెళ్లిపోయింది సరస్వతి. అతను హోటలుకు వెళ్ళిపోయేడు.

ఆరోజునించి వీలున్నప్పుడల్లా కాంతారావు గదికి వస్తూండేది సరస్వతి. ఇద్దరూ ఏవో కబుర్లు చెప్పుకునేవారు. కాంతారావు దగ్గర చాలా ఫ్రీగా వుండటం నేర్చుకుంది ఆ అమ్మాయి చాలా తక్కువ వ్యవధిలో.

సరస్వతి గురించి, ఆమె కుటుంబం గురించి కాంతారావుకి తెలిసిన విషయాలివి:

ఆ అమ్మాయి తండ్రి స్కూలు మాస్టరుగా చేసి రిటైరు అయినాడు. ఆయనకు అంతగా ఆస్థిపాస్తులేవీ లేవు. నలుగురు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. మగ పిల్లలు సరస్వతికంటే చిన్నవాళ్ళు. స్వగ్రామంలో ఓ ఎకరం మెట్ట పొలమూ, ఇప్పుడు వుంటున్న చిన్న యిల్లు తప్పించి మరేమీ లేవు. ఇంటిమీద అద్దె రాదు. పొలంమీద వచ్చే ఆదాయం, ఆయనకొచ్చే పెన్షనూ, ఆయన రెండో కూతురు కుట్టుమిషను మీద సంపాదించే డబ్బు ఆ కుటుంబానికి ఆధారమని తెలిసింది.

ఓరోజు సరస్వతి చెప్పింది... తను ప్రైవేటుగా బియ్యే చదువుతున్నాననీ, అందుకు కావలసిన సహాయం తన తండ్రి చెయ్యకపోయినా తన అక్కయ్య చేస్తానని పుస్తకాలు కొనిపెట్టిందనీ, చెప్పింది. ఇంకా తనంటే అక్కయ్యకి ఎంతో ప్రేమని, చిన్నతనం నించీ తనని ఎంతో శ్రద్ధగా చూసేదని కూడా చెప్పింది. ఆ అమ్మాయి మాటలద్వారా తన రెండో అక్కయ్యంటే మంచి ప్రేమ, గౌరవం వున్నాయని తెలిసింది.

తరచు తన గదికి వచ్చిపోతున్న సరస్వతి మీద కాంతారావుకి ఇష్టం కలిగింది. ఒకరకంగా ఆమెను బాగా ప్రేమించాడు. కాని, తన ప్రేమను సరస్వతి ముందు ఏనాడూ వ్యక్తపరచలేదు. కాని, సరస్వతి ప్రవర్తన నిండు కుండలా ఉండేది. ఆమె మాటల్లో ఎలాంటి తడబాటు

అతనికి కనిపించలేదు. మంచి స్నేహితుడితో మాట్లాడినట్లు అతనితో మాట్లాడేది.

ఓ ఆదివారం సాయంత్రం అతను గదిలో కూర్చొని ఏదో కథ రాస్తూంటే వచ్చింది సరస్వతి. మామూలుగానే పలకరించి మాట్లాడింది. కొన్ని నిముషాల తర్వాత "ఇప్పుడు మిమ్మల్నొక మాట అడుగుదామని వచ్చాను" అన్నది.

"ఏమిటి?" కుతూహలంగా అడిగాడు అతను. ఒకవేళ తనని ప్రేమిస్తున్నానని చెబుతుందేమో అనుకున్నాడు.

"నాకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. ఇంట్లో చదువుకోటానికి డిస్టర్బెన్స్‌గా వుంది. అసలు సాగటం లేదు. మీరు ఆఫీసుకి వెళ్ళిన తర్వాత మీ గది ఖాళీయే గదా? మీరు వచ్చేవరకూ ఇక్కడ చదువుకుంటాను. మీకేమైనా అభ్యంతరమా?" అని అడిగింది.

కాంతారావు కొంత ఆశాభంగం పొందినా అందుకు అంగీకరించాడు

"ఓ.కె. అలాగే! దానిదేముంది?" అన్నాడు.

ఆ మరుసటి రోజునుంచీ కాంతారావు ఆఫీసుకు వెళ్ళే సమయానికి పుస్తకాలు తీసుకొని అతని గదికి వచ్చేది సరస్వతి. తిరిగి అతను వచ్చేవరకూ వుండి రాగానే యింటికి వెళ్ళిపోయేది.

ఇలా ఓ పదిహేనురోజులు గడిచేయి. ఈ పదిహేను రోజుల్లో కాంతారావుకి సరస్వతిమీద వున్న ప్రేమ రెండింతలయింది. ఆ అమ్మాయిని గురించి గంటల తరబడి ఆలోచించటం మొదలుపెట్టాడు. ఆఫీసులో కూడా పరధ్యానంగా వుంటున్నాడు. రెండుమూడుసార్లు ఆఫీసరు చేత చివాట్లు తిని, సారీ కూడా చెప్పుకున్నాడు.

ఓరోజు కాంతారావు ఆఫీసుకి బయల్దేరుతుండగా పోస్ట్‌మేన్ ఓ కవర్ని అతని చేతిలో వుంచి వెళ్ళిపోయేడు. అది అతని తండ్రి రాసిన ఉత్తరం. 'ఉద్యోగంలో చేరావు కదా!... ఇంకెన్నాళ్లు బ్రహ్మచారిగా వుంటావు? ఇక్కడ మీ అమ్మ, బామ్మ నిన్నొక యింటివాడిని చెయ్యాలని తహతహలాడుతున్నారు. చాలా సంబంధాలొస్తున్నాయి. నువ్వు సరేనంటే ఏదో సంబంధాన్ని ఖాయం చేసుకుందాం. ఏమైనా ఈ శ్రావణమాసంలో నీ పెళ్ళి జరిగేటట్టు చూడమంటున్నారు. ఆపైన నీ యిష్టం" అని రాశాడు తండ్రి. ఆ ఉత్తరం కాంతారావుని మరింత తీవ్రంగా ఆలోచించేటట్టు చేసింది.

తన పెళ్ళికోసం ఇంట్లో పెద్దలు తొందరపడుతున్నారు. తనకీ తొందరగానే వున్నది. ఎవర్ని చేసుకోవాలన్నది సమస్య కాదు. తన మనసులో సరస్వతి రూపం కదులుతూనే వుంది. తనకిగాని, తండ్రికిగాని కట్నం ఆశ లేనేలేదు. బహుశ సరస్వతిని చేసుకోటానికి తల్లీ తండ్రీ అందరూ ఒప్పుకోవచ్చు. సరస్వతికీ తనని చేసుకోటం ఇష్టమే కావచ్చు. వాళ్ళ

కుటుంబ పరిస్థితులు తనకి తెలుసు. వాళ్ళింట్లో సరస్వతి తన భార్య కావటానికి ఎవరికీ అభ్యంతరం వుండదు.

ఇలా సాగిన అతని ఆలోచనలు కాంతారావుకి ఎంతో సంతోషాన్ని కలిగించాయి. అతని మనసు నిలవలేదు. ఆఫీసులో కూర్చోబుద్ధి కాలేదు. ఈ విషయం సరస్వతికి చెప్పాలి. 'సరస్వతీ! నిన్ను పెళ్ళి చేసుకోబోతున్నాను. నువ్వు నా భార్యవి. నువ్వే నా భార్యవి...." అని పరుగుమీద వెళ్ళి చెప్పాలి. ఒక్కసారి ఆమెను తనదగ్గరికి తీసుకోవాలి.

ఆఫీసులో పర్మిషన్ తీసుకొని బయటకు వచ్చాడు. ఖాళీగా పోతున్న రిక్షాను ఆపి ఎక్కి కూర్చున్నాడు. "త్వరగా పోనీ" అన్నాడు. రిక్షా తన గదిముందు ఆగే వరకూ ఏవో కలలుగన్నాడు. కాంతారావు హీరో... సరస్వతి హీరోయిన్... నిజానికి ఆఫీసునించి గదికి రావటానికి పది నిముషాలే పట్టినా అతనికి రెండు గంటలయినట్లనిపించింది.

రిక్షావాడికి ఇరవై రూపాయలనోటు యిచ్చి చిల్లర తీసుకోకుండానే గది దగ్గరకు నడిచాడు. తలుపులు వేసి వున్నాయి. సరస్వతి నిద్రపోతుందేమోనన్న ఆలోచన వచ్చి నవ్వుకున్నాడు. దబదబా తలుపులమీద బాదాడు.

"సరస్వతీ... సరస్వతీ..."

తలుపులు తెరుచుకోలేదు.

ఇక ఆగలేకపోయాడు. పక్కనేవున్న కిటికీ తలుపును గట్టిగా నెట్టాడు. లోపల గొళ్ళెం వేసిలేదేమో భళ్ళున తెరుచుకుంది తలుపు. తెరుచుకున్న కిటికీ రెక్కతోపాటు వెలుతురు విసురుగా లోపల ప్రవేశించింది. ఆ వెలుతురులో అతనికి కనిపించిన దృశ్యం...

ఎవరో అతను- కాంతారావుకి తెలీదు. తన లుంగీ వంటికి చుట్టుకుంటున్నాడు. ఆమె శరీరానికి చీరెను కట్టబెట్టుకుంటోంది. కళ్ళను మరింత విశాలంచేసి ఆశ్చర్యంగా చూశాడు. సరస్వతేమో అనుకున్నాడు. కాని కాదు. ఆమె అక్క. ఎనిమిదేళ్ళ క్రితం మొగుడు వదిలేసిన, కుట్టు మిషనుమీద డబ్బు సంపాదిస్తూ, కుటుంబాన్ని ఆదుకుంటూ చెల్లెల్ని చదివించు కుంటున్న అహల్య.

(మే 1977 జ్యోతి మాసపత్రికలో ప్రచురితం)